నేడు యధావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) సేవలను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో ఈ నెల 17వ తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి యధావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం https://meekosam.ap.gov.in అధికారిక వెబ్‌సైట్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు.

దిగుబడిపై దిగాలు..!

- ఎకరాకు 30 బస్తాలు మాత్రమే దిగుబడి
- అత్యధికంగా సాగుచేసిన సంపత్ స్వర్ణపై తీవ్ర ప్రభావం
- ఖర్చులు రావడమే గగనమంటున్న అన్నదాత
- రెండు జిల్లాలో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- 24 గంటల్లోనే సొమ్ములు జమతో రైతులకు ఊరట
- వర్షాల హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ మాసూలు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. రైతుల్లో మాత్రం ఆనందం లేకుండా పోయింది. దిగుబడి భారీగా తగ్గడంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు సైతం రాని పరిస్థితి నెలకొంది. ఈనిక, పొట్టదశలో భారీ వర్షాలు కురవడం, మొంథా తుపానుకు పొలాలు నేలకొరగడం వంటి కారణాలు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మాసూలు చేసిన లెక్కల ప్రకారం గత ఏడాదికంటే దిగుబడి బాగా తక్కువగా వస్తున్నట్లు రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులు ఎక్కువగా సాగు చేసిన సంపత్ స్వర్ణ 30 నుంచి 35 బస్తాల మధ్యలోనే దిగుబడి వస్తున్నట్లు రైతులు లబోదిబోమంటున్నారు. కొన్ని చోట్ల ఎకరాకు 29 బస్తాల దిగుబడి సైతం రావడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వరి సాగులో ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడి ఖర్చవుతోంది. రెండు జిల్లాల్లో వరిసాగులో అత్యధికంగా 80 శాతం కౌలురైతులే ఉన్నారు. ఎకరాకు 15 బస్తాల వరకూ కౌలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం వస్తున్న దిగుబడిలో కౌలు పోను కౌలు రైతులకు 15 నుంచి 20 బస్తాల వరకూ మాత్రమే ఉంటాయి. ప్రభుత్వ మద్దతు ప్రకారం 20 బస్తాలకు రూ.30 వేలకు మించి ఆదాయం రాదు. ఎకరాకు రూ.పది వేల వరకూ కౌలు రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఎకరాకు 40 బస్తాలు ఆపైన దిగుబడి వస్తేనే రైతులకు ఖర్చులు వచ్చే పరిస్థితి ఉంటుంది. దిగుబడి తగ్గుతుండడంతో రైతుల్లో నిర్వేదం అలముకుంది. ఆరు గాలం కష్టపడినా అప్పులు మిగులుతున్నాయంటూ రైతులు తీవ్ర వేదనకు గురవుతున్న పరిస్థితి నెలకొంది.

రెండు జిల్లాలో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

రెండు జిల్లాల్లోనూ ధాన్యం కొనుగోలు ముమ్మరంగా మొదలైంది. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 20 వేల మెట్రిక్ టన్నులు, పశ్చిమలో 20 వేల మెట్రిక్ టన్నులు మొత్తం 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం, తణుకు, పెంటపాడు వంటి మండలాల్లో ధాన్యం కొనుగోలు జరగ్గా, ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, చింతలపూడి వంటి మండలాల్లో ధాన్యం కొనుగోలు ముమ్మరంగా సాగుతోంది. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే సొమ్ములు జమవుతుండడం రైతులకు ఊరటనిస్తోంది. ఏలూరు జిల్లాలో ఇప్పటివరకూ రూ.28 కోట్ల వరకూ ధాన్యం సొమ్ము జమకాగా, పశ్చిమలోనూ అదేస్థాయిలో సొమ్ములు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పశ్చిమగోదావరి జిల్లాలో 2.05 లక్షల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగుచేయగా 6.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 265 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలును పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రారంభించారు. ఏలూరు జిల్లాలో ఖరీఫ్‌లో రెండు లక్షల ఎకరాల్లో వరిపంట సాగవ్వగా 5.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసి నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు శ్రీకారం చుట్టారు. 240 ఆర్ఎస్‌కెల ద్వారా కొనుగోలు ప్రారంభించారు. గడిచిన రెండు రోజులుగా ధాన్యం కొనుగోలు ఊపందుకుంది. ఇదే విధంగా కొనసాగితే పది రోజుల్లో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు జరిగే అవకాశం ఉంది. ధాన్యం సొమ్ము జమకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఎక్కువ మంది రైతులకు 24 గంటల్లోనే సొమ్ములు జమవుతున్నాయి. ఇది రైతులకు ఎంతగానో ఊరటనిచ్చే అంశంగా చెప్పొచ్చు. ధాన్యం కొనుగోలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో వర్షాలు పడే అవకాశం ఉందంటూ వాతావరణశాఖ చేస్తున్న హెచ్చరికలు రైతులను తీవ్ర కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే మొంథా తుపానుతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. రెండు జిల్లాల్లో దాదాపు 35 వేల ఎకరాల్లో రైతులు పంటను కోల్పోయారు. పలుచోట్ల పొలాలు నేలకొరిగి నీటిలో నానడంతో ధాన్యం రంగుమారిన పరిస్థితి సైతం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో వర్షాలు పడితే తీవ్ర నష్టం తప్పదన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. దీంతో వేగంగా ఖరీఫ్ మాసూలు పూర్తి చేసేందుకు రైతులు ప్రయత్నిస్తున్న పరిస్థితి కొనసాగుతోంది.

పక్కా ప్రణాళికతో వ్యవ'సాయం'

- రబీలో యూరియా సమస్యలేకుండా చర్యలు
- ఇప్పటికే పది వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు
- ఇ-పంట నూరు శాతం పూర్తి
- కౌలురైతులకు రూ. 50 కోట్ల పంట రుణాలు
- మొక్కజొన్న రైతుల సమస్యలపై ప్రత్యేక చర్యలు
- రైతులకు యంత్ర పరికరాలు అందజేతలో ముందంజ
- వ్యవసాయశాఖ జెడి హబీబ్ బాషా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'జిల్లాలో వ్యవసాయానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. వరి, మొక్క జొన్న, పొగాకు, మినుము, పెసలు, పత్తి వంటి అనేక పంటలు రైతులు సాగు చేస్తున్నారు. ఏడాది పొడవునా వివిధ పంటలకు సంబంధించిన వ్యవసాయ పనులు సాగుతూనే ఉంటాయి. పక్కా ప్రణాళికతో వ్యవసాయశాఖ పని చేయాల్సి ఉంటుంది. విశ్రాంతి అనేది లేకుండా వ్యవసాయశాఖ పని చేస్తేనే రైతులకు ప్రభుత్వం అందించే అన్ని రకాల సాయాలు అందించడానికి వీలుంటుందని జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పక్కా ప్రణాళికతో వ్యవసాయంలో ముందుకు సాగుతున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి హబీబ్ బాషా తెలిపారు. ఖరీఫ్ ముగింపు, రబీ సాగు ఆరంభం నేపథ్యంలో 'ప్రజాశక్తి ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇ-పంట నమోదు, రబీలో ఎరువు పంపిణీపై తీసుకున్న చర్యలు, కౌలు రైతులకు రుణాలు, మొక్కజొన్న రైతుల సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషి వంటి వివరాలను ఆయన వివరించారు.

ప్రశ్న : జిలా_వ్యాప్తంగా రబీలో ఎన్ని ఎకరాలు సాగువుతోంది. ఇ-పంట నమోదు ప్రక్రియ ఎంత వరకూ జరిగింది?

జెడి: రబీలో 2.40 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. వరి లక్ష ఎకరాల్లో, మొక్క జొన్న 40 వేల ఎకరాలు, పొగాకు 30 వేల ఎకరాలు, 20 వేల ఎకరాల్లో పెసలు, మినుము వంటి పంటలతోపాటు ఇతర పంటలు సాగవుతున్నాయి. నూరు శాతం ఇ-పంట నమోదు పూర్తయ్యింది.

ప్రశ్న : ఖరీఫ్'లో యూరియా సమస్య రాకుండా నిరంతరం పని చేశారు. రబీలో ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జెడి: ఖరీఫ్‌లో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో చిన్న చిన్న ఇబ్బందులు వచ్చినా యూరియా సమస్య లేకుండా చర్యలు తీసుకున్నాం. రబీలో మొత్తం 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా, 70 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరం కానున్నాయి. ఇప్పటికే పదివేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయి. ఎరువుల సమస్య లేకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నాం.

ప్రశ్న : కౌలు రైతులకు కౌలు కార్డులు ఎన్ని జారీ చేశారు. బ్యాంకుల నుంచి రుణాలు ఏమైనా అందాయా?

జెడి: మొత్తం 75 వేల కౌలు కార్డులు అందించాలని లక్ష్యం పెట్టుకోగా 62 వేల కార్డులు రైతులకు అందించాం. ఎనిమిది వేల మంది రైతులకు రూ.50 కోట్ల వరకూ రుణాలు అందించాం. కౌలు రైతుల సమస్యలపై నిరంతరంగా పనిచేస్తున్నాం.

ప్రశ్న : మొంథా తుపానుకు జిల్లాలో ఎంత మేర పంట నష్టం జరిగింది?

జెడి: జిల్లా వ్యాప్తంగా తుపానుకు 14,257 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. రైతులకు రూ.73 కోట్లు పంట నష్టపరిహారంగా అందించాలని ప్రభుత్వానికి నివేదించాం. వారం, పది రోజుల్లోనే జమయ్యే అవకాశం ఉంది.

ప్రశ్న : మొక్కజొన్న రైతుల అగ్రిమెంట్లపై ఏమైనా చర్యలు తీసుకున్నారా?

జెడి: మొక్కజొన్న విత్తనాలు ఎక్కువగా ప్రయివేటు నుంచి సరఫరా జరుగుతోంది. దిగుబడి రాక, డబ్బులు సరిగ్గా ఇవ్వకపోవడం వంటి కారణాలతో ఏటా పది శాతం రైతులు ఇబ్బంది పడుతున్నారు. రైతులు కూడా ఆర్గనైజర్లతో రహస్య అగ్రిమెంట్లు చేసుకోకూడదు. విత్తన కంపెనీల ఆర్గనైజర్లపై కేసులు పెట్టినా ఫలితం తక్కువగా ఉంటుంది. మొక్కజొన్న రైతులకు అవగాహన కల్పించి, ఇబ్బంది లేకుండా చేసేందుకు వ్యవసాయశాఖ నిరంతరం పనిచేస్తోంది.

ప్రశ్న : రైతులకు యంత్ర పరికరాలు ఏమైనా అందించారా?

జెడి : 52 మందికి డ్రోన్లు, 4,800 మందికి టార్పిన్లు అందజేశాం. 120 పవర్ ట్రిల్లర్లు, 240 రోటోవేటర్లు, 982 స్ప్రేలు వంటివి ఇచ్చాం. రైతులకు సాయం చేయడంలో ఎటువంటి అలసత్వం లేకుండా చర్యలు చేపడుతున్నాం.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మొంథా తుపాన్ ప్రభావం వల్ల జిల్లాలో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, ఉపాధి కోల్పోయిన వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు, మత్స్య కార్మికులకు నష్టపరిహారం చెల్లించి, నిత్యావసర సరుకులు పంపిణీ చేసి ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా సెక్రటేరియట్ సమావేశం తెల్లం రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి విచ్చేసిన బలరాం మాట్లాడుతూ తుపాను వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయారని, వరి పంట బయటకు బాగా కనబడుతున్నా కొన్ని ప్రాంతాల్లో మాసూళ్లకు వచ్చిందని, కొన్ని ప్రాంతాల్లో పొట్టదశలో, మరికొన్ని ప్రాంతాల్లో ఈనిక దశలోనే ఉందని, దీంతో వరి రైతులపై తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉందని తెలిపారు. ఎకరాకు పది బస్తాలకు పైగా నష్టం వాటిల్లిందని అధికారులు లెక్కలు చెబుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న, చిన్న కారు, పేద, కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లా యంత్రాంగం రైతులకు నష్టం జరగకుండా బరకాలు, సంచులు ఇవ్వాలన్నారు. ధాన్యం తేమశాతం ఏవిధంగా ఉన్నా కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే రైతులకు డబ్బులు చేతికందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల ధాన్యం కొనుగోలుకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలన్నారు. కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు క్వింటాకు 500 రూపాయలు బోనస్ అదనంగా చెల్లించి కొనుగోలు చేస్తున్నాయని, అలాగే ఆంధ్ర రాష్ట్రంలో కూడా క్వింటాల్‌కు రూ.3 వేలు చెల్లించి కొనుగోలు చేయాలన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు వరికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన పాడి రైతులను ఆదుకోవాలని, వరి రైతులతో పాటు రొయ్యలు, చేపల చెరువుల రైతులకు నష్టం వాటిల్లిందని, పత్తి, మినుము, కూరగాయలు, ఆకుకూరలతో పాటు పూల తోటలకు, అరటి తోటలతో పాటు కొన్నిచోట్ల కొబ్బరి తోటలు కూడా దెబ్బతిన్నాయని తెలిపారు. దెబ్బతిన్న అన్ని పంటలకూ రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ తుపాన్ వల్ల వ్యవసాయ కార్మికులు పని దినాలు కోల్పోయారని, ఆ మేరకు పని దినాలు లెక్క కట్టి వారికి నష్టపరిహారం చెల్లించడంతోపాటు నిత్యావసర సరుకులు అందించాలనే ప్రభుత్వ జిఒ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తుపాన్ శిబిరాల్లో పెట్టిన ప్రజానీకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు వేల పరిహారం, నిత్యావసర సరుకులు ఇస్తామని హామీ ఇవ్వడంతో పాటు జిఒలు జారీ చేసిందన్నారు. చింతలపూడిలోని శిబిరాల్లో ఉన్నవారికి ఈ రోజుకూ పరిహారం అందలేదని, రాష్ట్ర ప్రభుత్వం చెప్పేది ఒకటి, చేసేది మరొకటిలా ఉందని విమర్శించారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. ఏలూరులోని శిబిరాల్లోని ప్రజానీకం వద్ద టిడ్కో ఇళ్ల నిమిత్తం డబ్బులు కట్టించుకున్నారని, వాటికి ఇప్పటికీ వడ్డీలు కడుతున్నారని, ప్రభుత్వాలు మారుతున్నా వారికి కేటాయించిన ఇళ్లు పూర్తిచేసి నేటికీ ఇవ్వలేదని తెలిపారు. టిడ్కో ఇళ్లు ఇచ్చి ఉంటే తుపాన్ బాధితులుగా ఉండే వారు కాదని, తమ్మిలేరు ఏటిగట్టు పక్కన ఉండడం వల్లే శిబిరాల్లో తలదాచుకోవాల్సి వస్తోందన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు పట్టణాల్లోని టిడ్కో ఇళ్లు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, ఎం.నాగమణి, జి.రాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ పాల్గొని మాట్లాడారు.

మాట్లాడుతున్న బలరాం

నారాయణ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వరాన నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఏలూరులోని నారాయణ విద్యా సంస్థల డీన్ రమేష్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడన్న ఆరోపణలపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుని, సుమోటోగా కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం జంగారెడ్డిగూడెం జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. మండల కమిటీ సభ్యుడు పి.నాని అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మండల కార్యదర్శి డి.నాగేంద్రబాబు మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థలో విద్యార్థునులపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన డీన్ రమేష్‌పై ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. సోషల్ మీడియాలో అనేక వీడియోలు, ప్రకటనలు వెలుగులోకి వచ్చినప్పటికీ విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. అనుమతి లేకుండా హైస్కూల్, జూనియర్ కాలేజీ తరగతులను నడుపుతున్న విషయంపై గత సంవత్సరం నుంచే ఎస్ఎఫ్ఐ పలు ఫిర్యాదులు చేసిందని, కాని అధికారులు పది రోజులు ఒక వారం అంటూ వాగ్దానాలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని మండల నేతలు విమర్శించారు. మెరిట్ పరీక్షలకు సంబంధించిన సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి స్వేచ్ఛగా వ్యవహరించిన సందర్భాల్లో కూడా విద్యాశాఖ స్పందించకపోవడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే ఈ అంశాలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే, విద్యార్థి, యువజన, ప్రజాసంఘాలను ఐక్యం చేసి మరింతగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజా పోరాటాల్లో తాన రంగారావు కృషి ఆదర్శం

వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రవికుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రజా పోరాటాల్లో సిపిఎం నాయకులు తాన రంగారావు కృషి అందరికీ ఆదర్శమని సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పంపన రవికుమార్ అన్నారు. సిపిఎం నేత తాన రంగారావు మూడో వర్ధంతి కార్యక్రమం ఆదివారం స్థానిక చోడిదిబ్బ గ్రంథాలయం వద్ద ఉన్న అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించారు. ముందుగా రంగారావు చిత్రపటానికి రవికుమార్ పూలమాలతో నివాళులర్పించి మాట్లాడారు. రంగారావు భార్య తాన సింహాచలం ఏలూరు నగరంలో సంఘ వ్యతిరేక శక్తులకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించారని చెప్పారు. సింహాచలంపై రౌడీలు గొడ్డలి వేటు వేసి చంపారని, రంగారావు తుది వరకు ఉద్యమాన్ని విడవకుండా జీవించనంత కాలం కమ్యూనిస్టు ఉద్యమాల్లో చురుకుగా పని చేశారని కొనియాడారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు చోడి దిబ్బ ప్రాంతంలో గ్రంథాలయం నిర్మించి నిర్వహించడంలో రంగారావు పాత్ర కీలకమైందన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రజా పోరాటాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు జె.గోపి, నాయకులు అల్లం వెంకటేశ్వరరావు, బలుసు రెడ్డిశేఖర్, బొత్స సింహాచలం, కర్రి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

పూర్తికాని హాస్టల్ భవన నిర్మాణం

విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల హాస్టల్ వసతి గృహం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు తరగతి గదిలోనే పడుకోవడంతో గదులు సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హాస్టల్ భవనం పూర్తికాకపోవడంతో చూడడానికి శిథిలావస్థలో ఉన్నట్లుగా కనిపిస్తుంది. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి కనీసం లోపలికి వెళ్లడానికి కూడా దారి లేకుండా నిరుపయోగంగా మారాయి. భవనంపై పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. ఈ భవన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. కనీసం విద్యార్థులు ఆడుకోవడానికి కూడా మైదానం లేకుండా పోయింది. చిన్నపాటి వర్షమొస్తే గురుకుల పాఠశాల ప్రాంగణం మొత్తం నీటితో నిండిపోయి విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం త్వరగా చేపట్టి విద్యార్థులు హాస్టల్లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిర్మాణం పూర్తి కాని అంబేద్కర్ గురుకుల పాఠశాల హాస్టల్ భవనం

నూజివీడులో రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడులోని సారథి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఆర్చరీ పోటీలు, రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపిక ఆదివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడాకారుల ఎంపికకు నాకౌట్ విధానాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎఎంసి మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్చరీ పోటీలు నూజివీడులో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్చరీ క్రీడపై ఆసక్తి కలిగిన విద్యార్థులు నైపుణ్యత గల శిక్షణ పొంది జాతీయస్థాయిలో విజేతలుగా ఎదగడం ద్వారా బంగారు భవితకు బాటలు వేసుకోవాలన్నారు. అందుకోసం కూటమి ప్రభుత్వం ఎంతగానో సహకరిస్తున్నట్లు వివరించారు. విద్యార్థి దశలో చదువుతోపాటు క్రీడల్లో ప్రావీణ్యత సాధించడం ద్వారా ఉజ్వల భవిత విద్యార్థుల సొంతం అవుతుందని చెప్పారు.

ఏలూరులో సంతాన ప్రాప్తిరస్తు చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సంతాన ప్రాప్తిరస్తు సినిమా విజయోత్సవ యాత్రలో భాగంగా చిత్ర యూనిట్ ఏలూరు నగరంలో సందడి చేసింది. వన్‌టౌన్ ప్రాంతంలోని విజయలక్ష్మి థియేటర్ వద్ద అభిమానులు భారీగా తరలివచ్చి చిత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి హీరో విక్రాంత్ రెడ్డి, హీరోయిన్ చాందిని చౌదరి హాజరయ్యారు. థియేటర్‌కు వచ్చిన వెంటనే ప్రేక్షకులతో మాట్లాడిన వీరిద్దరూ చిత్రంపై వారి స్పందనలు అడిగి తెలుసుకున్నారు. సినిమా నచ్చిందంటూ అభిమానులు వ్యక్తం చేసిన ఆనందం చూసి యూనిట్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో వారు మాట్లాడుతూ సంతాన ప్రాప్తిరస్తు ఒక కుటుంబ కథ చిత్రమని, ఎన్నో సరదా సన్నివేశాలు ఉంటాయని చెప్పారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులందరూ థియేటర్లలో చూడాలని కోరారు. ఏలూరు ప్రేక్షకులు తమపై ఇంత ప్రేమ చూపిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మూవీ టీమ్ రాకతో థియేటర్ పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. అభిమానులు ఫొటోలు తీసుకుంటూ, సెల్ఫీలు దిగారు.

మాట్లాడుతున్న చిత్ర యూనిట్ సభ్యులు

ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - దెందులూరు

పెదపాడు మండలం వట్లూరులోని సీతాపురంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కీర్తిశేషులు నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో బిసిలకు అత్యంత ప్రాధాన్యత కల్పించి సామాజిక రాజకీయ రంగాల్లో వారి ఎదుగుదలకు అన్ని విధాలా అండగా నిలిచిన మహనీయులు నందమూరి తారకరామారావు అని అన్నారు. అదేవిధంగా పేద బడుగు బలహీన తరగతుల కోసం వారి సంక్షేమం కోసం కృషిచేసి సంక్షేమ పాలనకు తొలి మార్గదర్శిగా నిలిచిన తారకరామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రజల ప్రాణాలకు ఆటంకం కలిగించేలా ప్రమాదకరంగా మారిన విగ్రహాలను అక్కడి నుంచి తొలగించే కార్యక్రమం చేపడతామని, అటువంటి ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న విగ్రహం ఏ పార్టీకి చెందినదైన కూడా వాటిని అక్కడి నుంచి తొలగించే విధంగా చర్యలు చేపడతామని, వీటిపై త్వరలోనే అధికారులతో చర్చించి తగిన ఆదేశాలు జారీ చేస్తామని ఎంఎల్ఎ తెలిపారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

విచారణ చేపడుతున్న ఎస్ఐ

ఫిర్యాదుపై ఎస్ఐ విచారణ

ప్రజాశక్తి - కామవరపుకోట

పెట్రోల్ బంక్ వద్ద దౌర్జన్యం చేశారన్న ఫిర్యాదుతో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తడికలపూడి ఎస్ఐ చెన్నారావు తెలిపారు. మండల పరిధిలోని కామవరపుకోట - టి.నరసాపురం మండలాల సరిహద్దులో రాజుపోతేపల్లి అడ్డరోడ్డు వద్ద ఉన్న కె.జగ్గవరం సొసైటీ పెట్రోల్ బంక్ వద్ద రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు అక్రమ విధుల్లో ఉన్న సిబ్బందిపై దౌర్జన్యం చేసి ట్రాఫిక్‌తో పాటు వారి విధులకు ఆటంకం కలిగించారని కె.జగ్గవరం సొసైటీ ఛైర్మన్ బొంతు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఎస్ఐ చెన్నారావు విచారణ నిమిత్తం పెట్రోల్ బంక్‌ను సందర్శించి సిబ్బంది నుంచి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ కేసు విచారణ కొనసాగుతుందని తెలిపారు.

మాట్లాడుతున్న భిక్షాలు

26న నిరసన దీక్ష జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ముదినేపల్లి

విజయవాడలో నిర్మించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ శిలావిగ్రహాన్ని పరిరక్షించే నిమిత్తం ఈ నెల 26వ తేదీ జడ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే నిరసన దీక్షను అన్ని దళిత సంఘాలు విజయవంతం చేయాలని ముదినేపల్లి మండల ఆదర్శ దళిత పరిరక్షణ సంఘం అధ్యక్షులు నిమ్మగడ్డ భిక్షాలు కోరారు. ఆదివారం ముదినేపల్లి ఆదర్శ దళిత పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షాలు మాట్లాడుతూ ఈ నెల 26న రాజ్యాంగం ఆమోదించిన రోజున అన్ని దళిత సంఘాలు రాజకీయ పార్టీల మద్దతుతో జరుగుతున్న నిరసన దీక్షలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. దళితులపై నానాటికి దాడులు పెరిగిపోతున్నాయన్నారు. దళితులపై దాడులు ఆపకుంటే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. దళితులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఆదర్శ దళిత పరిరక్షణ సంఘం తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి బేతపూడి వెంకటరమణ, సోమల ప్రసాద్, లేళ్ల ఆంజనేయులు, ముత్యాల రాంబాబు, విజయసాగర్, సమూయేలు, దగాని కోటేశ్వరరావు, వర్రె జ్యోతి, కె.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

యువకునిపై కేసు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని బాలికకు మాయ మాటలు చెప్పిన యువకుడు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక పోలీసులను ఆశ్రయించింది. రూరల్ ఎస్ఐ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ పరిధికి చెందిన 14 ఏళ్ల బాలిక గుండుగొలను హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతుంది. బాలిక ఇంటి పక్కనే నివాసం ఉంటున్న మణికంఠ అనే యువకుడు బాలిక ఇంటికి వచ్చినప్పుడు ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని మాటలు చెప్పేవాడు. సెప్టెంబర్ 29వ తేదీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని తల్లికి చెప్పగా పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడు. దీంతో బాలిక ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రూరల్ ఎస్ఐ నాగబాబు ఈ ఘటనపై అత్యాచారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఈదులగూడెం గ్రామంలోని మామిడితోటల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,500 నగదును, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల పరిధిలో పేకాట, కోడిపందేలు వంటి జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల పరిధిలో జరిగే అసాంఘిక కార్యకలాపాల వివరాలను ప్రజలు డయల్ 112గానీ, ఆగిరిపల్లి ఎస్ఐ 9440796444 తెలియపరుస్తామని చెప్పారు.

నలుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

టి.నరసాపురం : పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని అప్పలరాజుగూడెంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు టి.నరసాపురం ఎస్ఐ ఎం.జయబాబు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురికి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.9,200 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గుర్తు తెలిని వ్యక్తి ఏలూరు రెండో పట్టణ పరిధిలోని బడేటి వారి వీధిలో ఒక దుకాణం ఎదుట మృతి చెంది పడి ఉన్నాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. రెండో పట్టణ ఎస్ఐ మధు వెంకటరాజా తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు రెండో పట్టణ పరిధిలోని బడేటి వీధిలో ఓ దుకాణం వద్ద వ్యక్తి రక్తపు వాంతులు చేసుకుని పడి ఉన్నాడన్న సమాచారాన్ని పోలీసులు అందుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది అతని పరీక్షించగా అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న టూ టౌన్ ఎస్ఐ మధు వెంకటరాజా వివరాలు సేకరించేందుకు ప్రయత్నించగా అతని వద్ద ఎటువంటి వివరాలు లభించలేదు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. వివరాలు తెలిసినవారు ఏలూరు టూ టౌన్ సిఐ 9440796606, టూ టౌన్ ఎస్ఐ 9948890429లకు సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అధ్వానంగా రోడ్లు.. ఇబ్బందుల్లో ప్రజలు

గోతులతో అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి - పోలవరం

గిరిజన ప్రాంతమైన పోలవరం మండలంలో ప్రత్యేక నిధులతో చిన్న పాటి మరమ్మతులు కూడా ఎందుకు నోచుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మారుమూల ప్రాంతాల్లో గిరి పుత్రులు అత్యవసర సేవలకు ఇటు పోలవరం, అటు దొండపూడి రావాలంటే గంటల సమయం పట్టడమే కాకుండా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. ప్రధానంగా పోలవరం మండలంలో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రికి ఆ రోడ్డు మార్గంలో వెళ్లాలంటే భయభ్రాంతులకు లోనవుతున్నారు. ప్రజా సమస్యలు, ఉద్యోగాలు, చదువుల కోసం ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే విద్యార్థులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది గిరిజన మండలం పోలవరంలోని గిరిజన గ్రామాల దుస్థితి.

పోలవరం మండలంలోని రేపల్లె వాడ నుంచి కొత్త దేవరగొంది మీదుగా గుంజవరం, గడ్డ గొయ్య, ఇటుకలకోట, బోడిగూడెం, కొమ్ముగూడెం, విజయరం, వెంకటరెడ్డిగూడెం, సునాలగండి, తోటగొంది, బంగారిగూడెం, తానాలకుంట, రామన్నపాలెం, గుంజవరం, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు కేటాయించిన పునరావాస గ్రామాలైన చేగొండపల్లి, సింగన్నపల్లి, మామిడిగొంది, పోలవరం తాలూకా ఆఫీస్ రోడ్డు వరకు తదితర గ్రామాలకు వెళ్లే గ్రామాల రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లన్నీ గోతులు, వర్షం వస్తే చెరువులు, ఎండ కాస్తే వాహనాల ధాటికి ఎగసిపడే దుమ్ము ఈ గ్రామాలకు శాపంగా మారాయి. వర్షం వస్తే అడుగు తీసి అడుగు వేయలేనంత బురద పేరుకుపోతోంది. ఎండకాస్తే దుమ్ము, మట్టితో వాహనదారులు అగచాట్లు అసాధారణమని చెప్పొచ్చు. అసలే గోతులతో ఉన్న రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయని గిరిజనులు, ప్రయాణికులు వాపోతున్నారు.

ప్రజల వేదనకు పరిష్కారం ఎప్పుడో

నిత్యం వందలాది మంది ప్రయాణించే ఈ రహదారుల వైపు అధికారులు గాని, ప్రజాప్రనిధులు గాని కన్నెత్తి చూడడం లేదంటున్నారు. రోడ్లన్నీ గోతులతో ఉంటున్నాయి. వర్షం వస్తే బురదమయం, ఎండ వస్తే ద్విచక్ర వాహనం వెళ్లిన దుమ్ము లేచి వెనుక వస్తున్న వారి కళ్లలో పడుతుంది. పోలవరంలో గుంతల పడిన రోడ్లకు ఆరు నెలల క్రితం రూ.లక్షలు వెచ్చించి మరమ్మతులు చేశారు. ఆరు నెలలు పూర్తి కాకుండానే వేసిన రోడ్లన్నీ గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. పాత రోడ్లలో ఉన్న గుంతలు కన్నా దారుణమైన గుంతలు పడ్డాయి.అటు నుంచి వెళ్లాలంటే ఏ గోతిలో పడతామనే భయంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ దారి వైపు ప్రభుత్వ గిరిజన పాఠశాలలు, ఏజెన్సీ గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఉన్నాయి. ఆరోగ్యం బాగోక ఎమర్జెన్సీగా రాత్రిపూట ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఈ అగాథ రహదారుల మీదుగా వెళ్లడానికి భయపడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు (ఫైల్)

రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి

సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్

మండలంలోని రేపల్లెవాడ, విజయరం, ఇటుకలకోట మీదుగా పోలవరం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం పోలవరం మండల కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టాం. రేపల్లెవాడ నుంచి పోలవరం రహదారి 20 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రభుత్వాలు, పాలకులు, ప్రజాప్రతినిధులు మారుతున్నా ఈ రహదారి నిర్మాణం మాత్రం అలాగే ఉంది. కూటమి ప్రభుత్వం రహదారి నిర్మాణ పనులు ప్రారంభించకపోతే ఆందోళన చేపడతాం.

కొనసాగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

భీమడోలులో...

ప్రజాశక్తి - భీమడోలు

గ్రంథాలయ ఉద్యమానికి విశేష సేవలను అందించిన మహనీయుల త్యాగాలు అజరామరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని పూళ్ల, గుండుగొలను, భీమడోలు శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఆయా గ్రంథ పాలకులు అమర్నాథ్, బంగారు పాప, కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారత జాతీయ గ్రంథాలయ పితామహులు డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్, స్వాతంత్ర్య పోరాట సమయంలో గ్రంథాలయాల స్థాపన, ప్రజలను చైతన్యపర్చే కార్యక్రమాలను నిర్వహించిన అయ్యంకి వెంకట రమణయ్య, గ్రంథాలయ స్థాపన ఉద్యమానికి నాయకత్వం వహించిన పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి సత్కరించారు. వారి పేర్లపై సదస్సులను నిర్వహించారు. భీమడోలులో నిర్వహించిన కార్యక్రమానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా తెలుగు కవి, వ్యాఖ్యాత, ప్రముఖులు డాక్టర్ జటావల్లభుల సాయిరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుండుగొలనులో నిర్వహించిన కార్యక్రమానికి కోదాడ ప్రభుత్వ కళాశాలకు చెందిన గ్రంథ పాలకులు గుర్రం నాగరాజు అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్ చేసిన గ్రంథాలయ శాస్త్ర రచనలు, పుస్తకాల వర్గీకరణ, వాటిని సబ్జెక్టుల వారీగా అమరిక, గ్రంథాలయ నిర్వహణకు అమలు చేయాల్సిన పంచ సూత్రాలు గురించి సదస్సులో వివరించారు. స్వాతంత్ర పోరాట సమయంలో గ్రంథాలయాల స్థాపనకు కృషి చేసిన అయ్యంకి వెంకటరమణయ్య గురించి వివరించారు. పాతూరి నాగభూషణం గ్రంథాలయ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు జల మార్గం ద్వారా గ్రంథాలను, పుస్తకాలను పాఠకులకు అందించడం ఇతర అంశాల గురించి తెలిపారు. గ్రంథాలయ స్థాపన ఉద్యమకారునిగా గుర్తింపు పొందిన పాతూరి నాగభూషణం జల మార్గం ద్వారా బోటుల్లో గ్రంథాలయ ఉద్యమానికి చేసిన కృషిని తెలిపారు. ఆపై పూళ్ల శాఖా గ్రంథాలయంలో దేశభక్తి గీతాల ఆలాపన పోటీలు, భీమడోలులో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు శాఖా గ్రంథాలయ రీడర్స్ ఫోరం అధ్యక్షులు ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మండవల్లి : గ్రంథాలయాల ఉద్యమకారుల వల్లే గ్రంథాలయాలు ఆవిర్భవించాయని గ్రంథాలయ అధికారిని షేక్ పరివీణ పేర్కొన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం గ్రంథాలయ ఉద్యమకారుల గురించి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంలో గ్రంథాలయ అభివృద్ధికి ఎస్ఆర్.రంగనాథన్ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన కృషి ఫలితంగానే గ్రంథాలయాలు ఏర్పడ్డాయన్నారు. గ్రంథాలయాలను వినియోగించుకుని ఎంతోమంది విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని ఆమె గుర్తు చేశారు. గ్రంథాలయ ఉద్యమకారులైన ఎస్ఆర్.రంగనాథన్,

ముదినేపల్లిలో...

అయ్యంకి వెంకటరమణయ్య, కాటూరి నాగభూషణం, గాడి చర్ల హరి సర్వోత్తమరావు గురించి విద్యార్థులకు వివరించి వారిని స్మరించుకున్నారు. అనంతరం పిల్లల చేత పుస్తక పఠనం చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సాహితీ మిత్రులచే కవితా పఠనం నిర్వహించినట్లు శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు తెలిపారు. సాహితీ మిత్రులు ఎల్ఆర్ పోలిశెట్టి, శ్యామ్, శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు, గ్రంథ్యాలయ పాఠకులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఉంగుటూరు గ్రంథాలయంలో



పెదపాడులో...

పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచి బండారు సింధు ప్రారంభించారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు జెడ్పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజారవీంద్ర, గ్రంథ పాలకురాలు శ్రీదేవి, ఉపసర్పంచి జగదీష్ పాల్గొన్నారు.

దెందులూరు : పెదపాడు శాఖా గ్రంథాలయంలో డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పెదపాడు జెడ్పి హెచ్ స్కూల్ సోషల్ మాస్టర్ బి.నాగరాజు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలకు ఊపిరి పోసిన ఉద్యమ కారులందరు నిస్వార్థ ప్రజా సేవకులుగా, చిరస్మరణీయులుగా నిలిచిపోయారన్నారు. వారు గ్రంథాలయాల స్థాపనకు, అభివృద్ధికి వీరు చేసిన కృషిని క్లుప్తంగా విద్యార్థులకు వివరించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఆరు, ఏడు తరగతుల వారికి "స్వచ్ఛభారత్- ఆవశ్యకత గురించి వ్యాసరచన పోటీలు జెడ్పిహెచ్ స్కూల్ సోషల్ మాస్టర్ పి.నాగరాజు, శ్రీకృష్ణ గురుకులం స్కూల్ హెచ్ఎం ఆర్.బెంజిమెన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు పర్యవేక్షణలో నిర్వహించారు. వచ్చిన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు.

ముదినేపల్లి : ముదినేపల్లి, గురజ శాఖ గ్రంథాలయాల్లో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారంతో మూడో రోజు చేరాయి. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జూనియర్ విద్యార్థులకు డ్రాయింగ్, కాంపిటీషన్, మ్యూజికల్ చైర్స్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.సుబ్బారావు, ఆయా గ్రంథాలయాల నిర్వాహకులు ఎం.శ్రీదేవి, జి.ఝాన్సీ, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు సేవలందించేందుకే రాయల్ క్లబ్



మాట్లాడుతున్న ప్రముఖులు

ప్రజాశక్తి - మండవల్లి

పేదలకు సేవలందించే లక్ష్యంగా రాయల్ క్లబ్ అసోసియేషన్ ఏర్పడిందని జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిన్నమిల్లి సత్యనారాయణ చెప్పారు. మండలంలోని భైరవపట్నం శుభం ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయల్ క్లబ్ సేవలు విస్తృతం చేసే విధంగా ప్రతిఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న 12 రాయల్ క్లబ్ల సంఖ్యను విస్తరించడం సభ్యులకు వివిధ రంగాల్లో యాజమాన్య నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలను ఆమోదించి ఆచరణాత్మక కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. చర్చించిన అంశాలు విద్య, వైద్య, పర్యావరణ పరిరక్షణకు విపత్తుల సమయంలో సేవ నైపుణ్యాభివృద్ధి రంగాల్లో విస్తృత సేవలను అందించడానికి ఉపయోగపడతాయని తెలిపారు. అంతేకాకుండా 2025-26 రాయల్ సర్వీస్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు ఇచ్చే మెరిట్ స్కాలర్‌షిప్ మొత్తం రూ.30 లక్షలకు పెంచి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయల్ క్లబ్ కైకలూరు అధ్యక్షులు ప్రొఫెసర్ సుదాబత్తుల విజయకుమార్, కార్యదర్శి రామిశెట్టి విజయ్ కుమార్, కోశాధికారి ఆచంట వెంకటరత్నం, సి మెంబర్ వడ్లని ఆంజనేయులు, పిఆర్ఒ కడిమి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల కార్తీక వనసమారాధనలు

దెందులూరులో...

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని గోపన్నపాలెం పిఇటి కాలేజీ గ్రౌండ్ ఆవరణలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి సహా పలువురు ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సోదర సోదరీ మణులు వారి కుటుంబ సభ్యులతో భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థుల సంక్షేమానికి వారి ఉన్నత చదువుల అంశంలో ఆయా సంఘాల సేవలతో పాటు తన వంతు కూడా సహకారం అందిస్తూ అండగా నిలుస్తానని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదవేగి మండలంలోని జానంపేటలోని విజయ గార్డెన్స్‌లో మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరమాచినేని ప్రభాకర్, వారి సహచరుల ఆధ్వర్యంలో కమ్మ సేవా సమితి 18వ వార్షికోత్సవ సందర్భంగా జరిగిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తిలకించి చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో కూడా కమ్మవారి సేవా సమితి ఆధ్వర్యంలో చేసే సంక్షేమ కార్యక్రమాలను మరింతగా పెంపొందించేలా కృషి చేయాలని సమితిలో సభ్యులైనా ఎంతోమంది తమ సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నారని వారి భాగస్వామ్యాన్ని కూడా అందుకుంటూ ముందుకు సాగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు నాయకులు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, సహా సంఘ సభ్యులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని గురజ గ్రామంలో ఉన్న శ్రీ గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక మాస అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్తీక మాస అన్న సమారాధనలో ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, ఎన్‌డిఎ నాయకులు శోభనాద్రి చౌదరి, ఎఎన్.బాబు, మాజీ సర్పంచి కామినేని వెంకటేశ్వరరావు, పోసిన పాండురంగారావు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : ద్వారకా తిరుమల కాపు సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో ఆదివారం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం కాపు సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని కాపు సంఘం వారు తెలిపారు. ముఖ్యఅతిథిగా గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు. మాజీ ఎంఎల్ఎ తలారి వెంకట్రావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డి గార్ల సువర్ణరాజు, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వాసు, ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు, వైసిపి నాయకుడు బొండాడ వెంకన్న బాబు, ద్వారకాతిరుమల కాపు సంఘం నాయకులు పెద్దిరెడ్డి జ్యోతి, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివాజీ, యేసుబాబు, అంబటి గాంధీ, పుప్పాల మురళీ, శ్రీను, చిలుకూరి ధర్ములు, చిలుకూరి నాగ సుబ్రహ్మణ్యం ,ఉక్కుర్తి వెంకటరావు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో...

సబ్ కలెక్టర్ కార్యాలయంలో నేడు పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 17వ తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) నిర్వహిస్తారని నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మండల కార్యాలయాల్లోనూ, మున్సిపల్ కార్యాలయంలో కూడా నేరుగా సమర్పించుకోవచ్చన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వివిధ పాఠశాలలు కేంద్రాలుగా ఈ నెల 17వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. శిబిరాల సేవలను 5 నుంచి 15 సంవత్సరాల మధ్యవారికి ప్రత్యేకించినట్లు తెలియజేశారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందేందుకు జెఇఇ, నీట్ ఇతర ప్రవేశ పరీక్షలు, పోటీ పరీక్షలలో పాల్గొనేందుకు దరఖాస్తుల కోసం ఆధార్ బయోమెట్రిక్‌లో నవీకరణ తప్పనిసరి అయిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా దుద్దేపూడి క్యాంప్ యూనిట్ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకు పూళ్ల ప్రజ్ఞ పాఠశాల, ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు గుండుగొలను. శ్రీ విద్యాలయ పాఠశాలలు కేంద్రాలుగా పనిచేస్తాయన్నారు. పొలసానిపల్లి యూనిట్ ఆధ్వర్యంలో భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కేంద్రంగా ఈనెల 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు, భీమడోలు శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల కేంద్రంగా ఈనెల 24వ తేదీన ఆధార్ ప్రత్యేక శిబిరాలు సేవలందిస్తాయన్నారు. ఈనెల 25 ,26వ తేదీలలో ఆగడాలలంక సెంట్ మేరీస్ స్కూల్. కేంద్రంగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు.

భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కోట లోపల శివాలయంలో 15 వేల మంది భక్తులకు ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ ఏటా కార్తీకమాసంలో వస్తున్న సాంప్రదాయమన్నారు. ఈ సాంప్రదాయంలో భాగంగా స్వామివారికి అన్న అభిషేకం నిర్వహించి, 15 వేల మంది భక్తులకు స్వామివారి అన్న ప్రసాదం వితరణగా అందించినట్లు చెప్పారు.

In the Court of the VI Additional District Judge, Kakinada (MACT)
M.V.O.P. No. 63/2023
Between:
Pithani Krishna and Others ...*Petitioners*
AND
Shaik Ahmad Basha & others ...*Respondents*
To: **Respondents-2:**
Gannabathula Nagendra, S/o. Venkata Satyanarayana, D.No. 3-117, Ramalayam Street, Chamakurapalem - 534275, Narasapuram, Bhimavaram Dist., Owner of Van No. AP 31 TC 3987,
పై నెంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **దీ. 02-12-2025 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై పిటిషను మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
చిక్కాల వీర వెంకట సత్యనారాయణ
అడ్వకేట్, రామారావుపేట,
కాకినాడ, సెల్: 9848252425

In the Court of the VI Additional District Judge, Kakinada
M.V.O.P. No. 83/2024
Between:
Sangadi Srinivasa Rao @ Srinivas ...*Petitioner*
AND
Gadiraju Suresh Raju & aother ...*Respondents*
To: **Respondents-1:**
Gadiraju Suresh Raju, S/o. Kishore Raju, Recherla Road, D.No. 3-142/3, Prathipadu Village, Pentapadu Mandal, Pin: 534166, W.G.District, Driver and Owner of Bajaj Cargo Van No: AP 39 TS 3953.
పై నెంబరు పిటిషన్‌లో 1వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **దీ. 16-12-2025 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై పిటిషను మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
చిక్కాల వీర వెంకట సత్యనారాయణ
అడ్వకేట్, రామారావుపేట,
కాకినాడ, సెల్: 9848252425

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి
నా క్లయింట్ అయిన పరుచూరి గోపి, తండ్రి: సూర్యారావు, రేలంగి, ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, సెల్. 84999 60000, ఇచ్చిన సంజాయిషీ మేరకు. నా క్లయింట్ కొనుగోలు చేసి, తణుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ కాబడిన దస్తావేజులు నెం. 4940/2025, 4941/2025, 5083/2025, 5084/2025 లు ది. 11-11-2025న రేలంగిలో జిరాక్స్ నిమిత్తం వెళుతుండగా, మార్గ మధ్యలో పోయినవి. దొరికినవారు తెలియజేయగలరు.
ఇట్లు:
కసాని వెంకన్నబాబు, అడ్వకేట్, రేలంగి, సెల్ 9948292939